
# 4

# సింధులోయ నాగరకత

## (Indus Valley Civilization)

ఈ 20 వ శతాబ్దంలో రెండు దశాబ్దాలు గడచేవరకు కూడా భారతదేశ ప్రాచీన చరిత్ర వేదకాలము, ఆర్యుల నాగరకతతో ప్రారంభ మవుతుందనే చరిత్రకారులు భావించినారు. కాని 1922 నుంచి జరిగిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన ఆధారాలవల్ల భారతీయ సంస్కృతి అతిప్రాచీనమైనదనీ, భారతచరిత్ర ఇప్పటికి 5000 సంవత్స రాల క్రితమే ప్రారంభమైందనీ, ఈజిప్టు మెసొపొటేమియా నాగర కతలకు సమకాలీనమైందనీ తేలింది. ఈ పరిశోధనలను ప్రారంభించిన వారిలో ముఖ్యులు భారతీయ పురావస్తుశాఖకు చెందిన సర్ జాన్ మార్షల్, దయా రాం సాహిణి, ఆర్. డి. బెనర్జీ మొదలైనవారు.

గత 40 సంవత్సరాలుగా జరిగిన తవ్వకాలు, పరిశోధనల ఫలి తంగా సింధులోయ నాగరకత బహుముఖంగా వ్యాపించిన ఒక విశాల నాగరకతలో భాగమనిపిస్తున్నది (దేశ పటము 5). సింధులోయలోని ప్రఖ్యాత నగర కేంద్రాలు పంజాబులోని హరప్పా (Harappa), సింధ్ లోని మొహెంజొదారో (Mohenjodaro). ఈ నాగరకత సిమ్లాకొండ లవద్దనున్న రూపర్ (Rupar) నుంచి అరేబియా సముద్ర తీరంలోని సుత్కజందోర్ (Sutkagendor) వరకూఉన్న ప్రదేశమంతా వ్యాపించి నట్లు చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. గత దశాబ్దంలో దొరికిన చరిత్ర ఆధారాలనుబట్టి ఈ నాగరకత తూర్పున యమునానది ప్రాంతంలోని ఉఖ్ లిన (Ukhlina) వరకూ, దక్షిణాన కథియవాడ్, కాంబే అఖాతం వరకూ వ్యాపించినట్లు తెలుస్తోంది. సింధులోయ నాగరకత అరే బియా సముద్రతీరంవరకూ వ్యాపించిందనే విషయము చాలా ముఖ్య మైంది. సముద్రతీరం చేరువలోఉన్న నాగరకత సముద్రమార్గం ద్వారా విదేశాలతో సంబంధాలు కలిగిఉండడానికి అవకాశం ఉంది.




దేశపటము ౬. సింధులోయ నాగరకత కేంద్రాలు

భావి పరిశోధనలు ఈ విషయాన్ని గురించిన ప్రశ్నలకు జవాబులు కనుక్కోవచ్చు.

## హరప్పా, మొహెంజొదారో నగర శిథిలాలు

సింధులోయ తవ్వకాలలో బయల్పడిన విషయాలలో అతి ముఖ్యమైనవి హరప్పా, మొహెంజొదారో స్థలాలలో జరిగిన పరిశోధనల మూలంగా తెలుస్తోంది. ఈ రెండు చోట్లు ఆ కాలంలో నగరాలుగా విలసిల్లినటువంటివి. ప్రతి నగర పరిధి సుమారు 3 మైళ్ళు. ఈ నగరాలలో బయటపడిన దుర్గప్రాకార అవశేషాల మూలంగా 500 గజాలు నిడివి, 300 గజాలు వెడల్పు ఉన్న దుర్గాలు రెండు

చోట్లలో ఉన్నట్లు కనబడుతోంది. ఇక్కడి అవశేషాలు నాటి పౌర జీవనము, గృహావసతులు, జలనిర్గమ విధానాలు, నగర నిర్మాణము, మత సాంఘిక జీవనము మొదలైన అనేక విషయాలను గురించి చాటుతున్నాయి. దుర్గప్రాకారాలు, వసతి గృహాలు, ధాన్యాగారాలు కాక మొహెంజొదారో నగరంలో కొన్ని ముఖ్య భవనాలు, నిర్మాణాలు తవ్వకాలలో బయటపడినాయి.

## స్నానకుండము (Great Bath)

మొహెంజొదారో దుర్గప్రాంగణంలో బయటపడిన నిర్మాణాలలో ప్రసిద్ధిచెందినది స్నానకుండము. దీని పొడవు 39 అడుగులు, వెడల్పు 23 అడుగులు, లోతు 8 అడుగులు. ఈ కోనేరులోకి దిగడానికి ఉత్తర భాగంలోను, దక్షిణ భాగంలోను మెట్లు ఉన్నాయి. కోనేరుప్రక్క గోడలు, అడుగు భాగము కట్టుదిట్టంగా నిర్మించబడినాయి. జలాశయంలోనుంచి నిలువనీరు నిర్గమించడానికి, కొత్త నీరు జలాశయంలోకి రావడానికి మార్గాలు నిర్మించబడినాయి. కోనేరు చుట్టూ వరండాలు, వాటిని ఆనుకొని స్నానపు గదులు ఉన్నాయి. ఈ మహా స్నానకుండము మత సంబంధమైనది కావచ్చునని చరిత్రకారులు ఊహిస్తున్నారు.

## ధాన్యాగారము (Great Granary)

స్నానకుండం పడమరగా గొప్ప ధాన్యాగారం ఉంది. దాని పొడవు 150 అడుగులు, వెడల్పు 80 అడుగులు. ఇందులో 27 ధాన్యపు కొట్లు ఉన్నాయి. ఈ భారీ నిర్మాణము ధాన్యాన్ని దించడానికీ, పైకి తీయడానికీ అనువుగా తగిన గాలి, సూర్యరశ్మి ఉండేటట్లు కట్టినారు. స్నానకుండం ఈశాన్యాన ఒక పెద్ద భవనంఉంది. దాని పొడవు 230 అడుగులు, వెడల్పు 78 అడుగులు. ఇది మతాధిపతులకు మఠము కావచ్చునని ఒక అభిప్రాయము.

Govt Junior College Prakasam Dt. Dt........ DARSI - 523 247

## సింధు నాగరకతనాటి రాజకీయ పరిస్థితులు

హారప్పా మొహంజొదారొలలోని [illegible] అవశేషాల మూలంగా సింధు నాగరకత కాలంలోని నగరాలను క్రమ బద్ధంగా నిర్మించినట్లు తెలుస్తోంది. పురవీధులు విశాలంగాఉండి, వీధికిరువైపుల ఇండ్లు క్రమపద్ధతిన కట్టబడిఉండేవి. ఈ కాలపు నగరాలలో ముఖ్య భవనాలు ఒక కోటలోని ఆవరణలో ఉండేవి. మొహెంజొదారొలో రాజ్యపు ధాన్యాగారం కూడా దుర్గప్రాకారంలోనేఉండేది. రాజులు తమ నివాసాలను దుర్గంలోనే ఏర్పరచుకొని ఈ నగరాలను పాలించి ఉండవచ్చునని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. నాటి నివాస గృహాలనుబట్టి, ఆ కాలమువారు ప్రధానంగా లౌకికదృష్టి కలవారని తెలుస్తోంది. ప్రజల జీవనస్థాయి తృప్తికరంగాను, ఉత్కృష్టంగాను ఉండేదని చెప్పవచ్చు. ఈ విషయంలో సింధునాగరకత ఈజిప్టు నాగరతకు భిన్నంగా ఉండేది. ఒకదానికొకటి 640 కి. మీ. దూరంలో ఉన్న హారప్పా మొహెంజొదారొ నగరాలు ఒక సామ్రాజ్యంలోని రెండు ప్రధాన నగరాలేమోనని వీలర్ పండితుని అభిప్రాయము. అలాగైతే రోము సామ్రాజ్యానికి పూర్వం ఏర్పడిన సామ్రాజ్యాలలోకల్లా సింధు సామ్రాజ్యము అతిముఖ్యమైనది అవుతుంది.

సింధు నాగరకతనాటి నగరాలలో ఆ నగర నిర్మాణక్రమము, మంచినీటి సరఫరా, మురుగునీరు నిర్గమించే విధానాలు మొదలైన విషయాలనుబట్టి అక్కడ అతి చాకచక్యంతో వ్యవహారించే పురపాలక సంస్థలు ఉండేవని ఊహించవచ్చు.


## సాంఘిక, ఆర్థిక పరిస్థితులు

సింధునాగరకత నాటి ప్రజలు సుఖజీవనాన్ని గడిపేవారు. వారు నివసించే గృహాలు కాల్చిన ఇటుకలతో కట్టుకొనేవారు. విశాల ప్రాంగణము, వంటగది, స్నానాలగది ఉండేవి. మురికినీరు పోవడానికిగొట్టాలు అమర్చబడి మిక్కిలిసౌందర్యంగా ఉండేవి. కొన్ని ఇండ్లకు మిద్దెలు ఉండేవి. ప్రతి ఇంట్లో మంచినీటి బావిఉండేది.

ఆనాడు ముఖ్య ఆహార పదార్థాలు గోధుమలు, బార్లీ, బియ్యము, ఖర్జూరము, ఫలాలు, కూరగాయలు, పాలు. మాంసాహారంలో అనేక రకాలను ప్రజలు తినేవారు. ఖడ్గమృగము, పులి మొదలైన వన్యమృగాలు సింధునాగరకత కాలంలో ఉండేవి. ఆనాడు గొర్రెలు, ఎద్దు, గాడిదలు, బర్రెలు, ఏనుగులు, ఒంటెలు మొదలైన మృగాలను మచ్చికచేసి ప్రజలు వాటిని ఉపయోగించుకొన్నారు. సింధు ప్రజలు ధోవతి, ఉత్తరీయం ధరించేవారు. వారు నూలు బట్టలను, ఉన్ని బట్టలను వాడేవారు. సింధు స్త్రీలు పలురకాలైన కేశాలంకరణలు చేసేవారు. పురుషులు, స్త్రీలు అనేకరకాలైన బంగారు, వెండి, రాగి ఆభరణాలను ధరించేవారు. వీరు వాడిన నగలలో ముఖ్యమైనవి గాజులు, లలాటసరము, కుండలాలు, హారాలు, మేఖలాలు, ఉంగరాలు. సింధు ప్రజలు అలంకరణ సామగ్రిని ఉపయోగించేవారు.

సింధునాగరకతకాలంలో వివిధరకాలైన గృహసామగ్రిని వాడేవారు. ఇవి మట్టితో, రాతితో, లోహాలతో, దంతంతో చేసినవి. అనేక రకాలైన పాత్రలను ప్రజలు వాడేవారు (చిత్ర పటము 11). ఇళ్ళలో వివిధ రకాలైన ఆసనాలు ఉండేవి. నాటి వినోదాలలో చదరంగం ముఖ్యమైనది. అనేక రకాలైన ఆటవస్తువులు ఉండేవి. పిల్లలు ఆడుకోడానికి మట్టితో చేసిన బొమ్మ బండ్లు సింధు శిథిలాలలో దొరికినాయి. ఆ కాలంలో ప్రయాణానికి ముఖ్యంగా ఎడ్లను ఉపయోగించేవారు.


సింధు నాగరకులు రాగి, తగరము, వెండి, బంగారము విరివిగా వాడేవారు. సింధుదేశానికి మధ్య ఆసియా, ఈశాన్య ఆఫ్ఘనిస్థాన్, ఈశాన్య పర్షియా, దక్షిణ భారతదేశము, బలూచిస్థానము మొదలైన ప్రదేశాలకు, మెసొపొటేమియాతోను వ్యాపార సంబంధాలు ఉండేవి. సముద్రమార్గంద్వారా కూడా వాణిజ్య సంబంధాలు ఉండేవి. సింధు ప్రజలు నిర్ణీత కొలతలను, బరువులను వాడేవారు.



చిత్రపటము 11. హరప్పా మృణ్మయ సంపద

## మతము

సింధులోయ త్రవ్వకాలలో బయల్పడిన నిర్మాణాలనుబట్టి, ముద్రలనుబట్టి నాటి మత విషయాలు తెలుస్తున్నాయి (చిత్రపటము 12). సింధు ప్రజలు పూజించిన దేవతలలో ముఖ్యులు, మాతృమూర్తి, పశుపతి, లింగము. వీరు వృషభానికి మిక్కిలి ప్రాముఖ్యాన్ని ఇచ్చేవారు. వీరు వనదేవతలను పూజించేవారు. జైన విగ్రహాలవలె కాయోత్సర్గ భంగిమలో నిలబడిఉన్న మూర్తులు సింధు త్రవ్వకాలలో దొరికినాయి. శైవము, జైనము ప్రారంభదశలు సింధు లోయలోనని పై ఆధారాలతో కొందరు చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు.



చిత్రపటము 12. మొహెంజొదారొ ముద్రలు

సింధు ప్రజలు మృతదేహాలను ఖననంచేసేవారు. మొహెంజొదారొలో మూడు ఖనన విధానాలు కనబడినాయి, మొదటిది శరీరాన్ని పూర్తిగా ఖననంచేయడం. రెండోది మృతదేహాన్ని మృగాలు, పశులు తినగా మిగిలిన శరీరభాగాన్ని ఖననంచేయడం. మూడోది మృతశరీరదహనం తరవాత అవశేషాలను ఖననంచేయడం. హరప్పా, మొహెంజొదారొ సమాధులలో దొరికిన ఎముకలు, అస్థిపంజరాలు, శరీరాలతో పాతిపెట్టిన సామగ్రి, వీటివల్ల నాటి ఆచారాలు తెలుస్తున్నాయి.

## లిపి

సింధు నాగరకత కాలంలో ప్రత్యేకలిపి ఉండేది. ఈ లిపి ఉన్న మొహారులు కొన్ని వేలు దొరికినాయి. ఈ లిపిని చదవడానికి అనేకులు ప్రయత్నిస్తున్నారు. ఇది ద్రావిడులకు సంబంధించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## కళలు

హారప్పాలో దొరికిన సున్నితమైన పనితనంతో చేసిన నాట్య శిల్పంతో బాటు సింధులోయలో 11 శిల్పాలు దొరికినాయి. కంచు విగ్రహాలు, మృణ్మయ శిల్పాలు సింధునాగరకత కళను చాటుతున్నాయి. సింధుకాలంనాటి మట్టిపాత్రలు చాల ప్రసిద్ధాలైనవి.

## సింధునాగరకత కాలము

సింధు నాగరకతకు, ఇరాన్, ఇరాక్ నాగరకతలకు ఉన్న సంబంధాలనుబట్టి సింధునాగరకత కాలాన్ని నిర్ణయించినారు. ఇటీవల జరిగిన పరిశోధనలవల్ల, కార్బన్-14 అనే కాలనిర్ణయపద్ధతి మూలంగా, సింధునాగరకత కాలము సంశయంలేకుండా నిర్ణయించినారు. కొట్-దిజి అనే స్థలంలో హారప్పాలోని నాగరకతకు పూర్వం ఉండిన నాగరకత బయటపడింది. దీని కాలము సుమారు క్రీ. పూ. 2600. కాలిబంగన్ అనే స్థలంలోని నాగరకత కాలము సుమారు క్రీ. పూ. 2165. క్రీ. పూ. 2600లో ప్రారంభమైన సింధులోయ నాగరకత సుమారు క్రీ. పూ. 1800లో అంతరించింది.

సింధులోయ నాగరకతకు మెసొపొటేమియా నాగరకతకు పోలికలు, సంబంధాలు ఉన్నా సింధులోయ నాగరకతలో ప్రత్యేకత, విశిష్టత ఉందని నేటి చరిత్రకారులు అంగీకరిస్తున్నారు. సమకాలిక నాగరకతల ప్రభావంమాత్రం సింధు నాగరకతపై కనిపిస్తోంది.

## సింధులోయ నాగరకత అంతరించడానికి కారణాలు

సింధులోయ నాగరకత అంతరించడానికి ఉన్న కారణాలమీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కొందరు సింధునది వరదలు కారణమనీ, కొందరు విదేశదండయాత్ర కారణమనీ, మరికొందరు సింధు నాగరకత స్వాభావికంగానే క్షీణించిందనీ అంటున్నారు. ఈ కారణాలు ఒకటేకాక, అన్నీ కలసి సింధు నాగరకత సమాప్తానికి కారణము అయిఉండవచ్చు.